నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

మండల విద్యాధికారి రాంరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ రాంరెడ్డి

శంషాబాద్: ప్రైవేటు పాఠశాలల్లో నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని మండల విద్యాధికారి రాంరెడ్డి హెచ్చరించారు. మంగళవారం మండలంలోని ప్రైవేటు పాఠశాలల యజమానులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. పాఠశాలలో పుస్తకాలు, యూనిఫామ్‌ల విక్రయాలు జరపకూడదని, నిర్ధారించిన ఫీజులు మాత్రమే వసూలు చేయాలన్నారు. అర్హులైన వారిని మాత్రమే ఉపాధ్యాయులుగా నియమించాలన్నారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలను ప్రతి పాఠశాలలోని నోటీసు బోర్డుల్లో పేర్కొనాలని సూచించారు. పబ్లిషర్స్ చేత 'నో ప్రాఫిట్.. నో లాస్' కింద మాత్రమే పుస్తకాలు విక్రయించాలని సూచించారు. స్కూల్ బస్సులు పూర్తి ఫిట్‌నెస్‌తో ఉండటంతో పాటు నిపుణులైన డ్రైవర్లను నియమించుకోవాలన్నారు. పరిమితికి మించి విద్యార్థుల ప్రయాణం చేయడానికి వీల్లేదన్నారు.

పాఠశాలలు సిద్ధం..

ప్రభుత్వ పాఠశాలలన్నీ కూడా బుధవారం నుంచి ప్రారంభించేందుకు పూర్తి సిద్ధంగా ఉన్నాయని, మండల విద్యాధికారి రాంరెడ్డి తెలిపారు. విద్యార్థులకు సరిపడా యూనిఫామ్‌లు, పుస్తకాలు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయన్నారు.

'గృహజ్యోతి' అమలు చేయాలి

రాజేంద్రనగర్: రాష్ట్రంలో ఎన్నికలకోడ్ ముగియడంతో 6 గ్యారంటీల్లోని గృహజ్యోతి పథకాన్ని వెంటనే అమలు చేయాలని సీపీఐ రంగారెడ్డిజిల్లా కౌన్సిల్ సభ్యులు వనంపల్లి జైపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాజేంద్రనగర్‌లోని సీపీఐ పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే గృహజ్యోతి పథకాన్ని అమలు చేస్తామని చెప్పారన్నారు. ఈ పథకం ద్వారా వినియోగదారులకు 200 యూనిట్లు వరకు వచ్చే బిల్లులు జీరో కింద బిల్లులు అమలు చేయాలని, రాష్ట్రంలో కొన్ని జిల్లాల్లో అమలు చేస్తున్నారన్నారు. రంగారెడ్డి జిల్లాలోని అన్ని మండలాలు, గ్రేటర్ పరిధిలో వచ్చే అన్ని డివిజన్‌లలో కూడా అమలు చేయాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వృద్ధాప్య పెన్షన్‌ను రూ.4 వేలు, మహిళలకు రూ.2,500లు, గ్యాస్ సిలిండర్ రూ.500లకు హామీలు ఇచ్చారన్నారు. ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సీపీఐ పార్టీ సీనియర్ నాయకులు నిరంజన్‌గౌడ్, సత్యం పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జైపాల్‌రెడ్డి

తాగునీటి సమస్యలు పరిష్కరించాలని..


జలమండలి అధికారులను నిలదీస్తున్న ఇందిరమ్మ కాలనీవాసులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ఇందిరమ్మ కాలనీలో తాగునీరు రావడం లేదని మహిళలు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మంగళవారం వారు మాట్లాడుతూ.. గత 15 రోజులుగా తాగునీరు సరఫరా కాకపోవడంతో తాము తీవ్ర ఇబ్బందిపడుతున్నామన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఇందిరమ్మ కాలనీలో అనేక ఆవాసాలు పెరిగాయి. దీంతో ఇక్కడి ప్రజలకు తాగునీటిని అందించడంలో జల మండలి అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారనే ఆరోపణలున్నాయి. పెద్ద పెద్ద అపార్ట్‌మెంట్లకు డబ్బులకు నీటిని అమ్ముకుంటూ వ్యాపారాలు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై స్థానికులు వెళ్లి అధికారులను నిలదీయగా.. స్పందించిన జలమండలి సిబ్బంది తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

రూ.18 లక్షల నకిలీ నోట్లు సీజ్

కర్ణాటక నుంచి బైక్‌పై తీసుకొస్తుండగా పట్టుకున్న పోలీసులు

శంషాబాద్ రూరల్: బైక్‌పై కర్ణాటక నుంచి హైదరాబాద్ తరలిస్తున్న రూ.18 లక్షల నకిలీ నోట్లను పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శంషాబాద్ పోలీసులు మంగళవారం ఉదయం తొండుపల్లి వద్ద బెంగళూరు జాతీయ రహదారిపై వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో షాద్‌నగర్ వైపు నుంచి ఓ వ్యక్తి బైక్‌పై శంషాబాద్ వస్తున్నాడు. ఈ క్రమంలో నంబరు ప్లేటు లేకుండా ఉన్న బైక్‌పై వస్తున్న సదరు వ్యక్తి పోలీసులను చూసి తప్పించుకునేందుకు యత్నించాడు. అనుమానం వచ్చిన పోలీసులు బైక్‌ను ఆపి పేపర్లు అడగగా.. లేవని చెప్పాడు. అనుమానం వచ్చిన పోలీసులు అతడి వద్ద ఉన్న బ్యాగును తనిఖీ చేశారు. పోలీసుల తనిఖీల్లో రూ.500 నోట్ల కట్టలు బయటపడ్డాయి. వాటిని నిశితంగా పరిశీలిస్తే నకిలీవని తేలాయి. వంద నోట్లు ఉన్న 36 బండిల్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

కలర్ జిరాక్స్ తీసి..

కర్ణాటక రాష్ట్రం కొప్పల్ జిల్లా హోసలింగాపురానికి చెందిన కొరచ మురుగేష(25) జిరాక్స్ షాపు నిర్వహిస్తున్నాడు. రాయచూర్ జిల్లా లింగసుగూర్ మండలం జంతపూర్‌లో నివాసం ఉండే మురుగేష అన్న కొరచ రవిచంద్ర (42), సోదరుడి కుమారుడు కొరచ యోగేష్ (22) కలిసి జిరాక్స్‌షాపులో నకిలీ రూ.500 నోట్లను జిరాక్స్ తీసుకున్నారు. వీటిని శంషాబాద్ వెళ్లి తనకు ఫోన్ చేయాలని మురుగేషకు రవిచంద్రకు చెప్పాడు. ఈ క్రమలో అక్కడకు ఓ వ్యక్తి వచ్చి.. రూ.3 లక్షల నకిలీ డబ్బులకు రూ. లక్ష అసలు నోట్లు ఇస్తాడని చెప్పి పంపాడు. దీంతో మురుగేష ఈనెల 10న సాయంత్రం వీటితో అక్కడి నుంచి బయలుదేరాడు. తొండుపల్లి వద్ద పోలీసులకు పట్టుబడ్డాడు. అతడి వద్ద రూ.18 లక్షల నకిలీ నోట్లు, సెల్‌ఫోన్, రూ.6,500 నగదు, బైక్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


నకిలీ నోట్లు తరలిస్తూ పోలీసులకు పట్టుబడిన వ్యక్తి

గైర్హాజరును సమర్థించలేం !

చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు సిఫారసు ● నార్సింగి కౌన్సిలర్ల ఏకగ్రీవ తీర్మానం


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ నాగపూర్ణశ్రీనివాస్


సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

మణికొండ: ప్రజా సమస్యలను సకాలంలో పరిష్కరించడంతో పాటు వాటిపై జరుగుతున్న కార్యాచరణను ప్రజాప్రతినిధులకు తెలపాల్సిన అధికారులు మున్సిపల్ సర్వసభ్య సమావేశానికి రాకపోవడంపై సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు సమాధానం చెప్పాల్సిన ప్రజాప్రతినిధులు నిర్వహించే సమావేశానికి రాకపోవటం తమను అగౌరవ పరిచినట్లేనని, అలాంటి అధికారులపై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని వారు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు.

◆ నార్సింగి మున్సిపాలిటీ పాలకకమిటీ సమావేశం చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్ అధ్యక్షతన మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. ఇటీవల అవిశ్వాసం పెట్టి పాత చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌లను పదవీచ్యుతులను చేసి కొత్తవారు ఎన్నికైన తర్వాత తొలి సమావేశం వాడివేడిగా జరిగింది.

మాజీల డుమ్మా..

నార్సింగి మున్సిపాలిటీకి గత నాలుగేళ్లుగా చైర్‌పర్సన్‌గా రేఖాయాదగిరి, వైస్ చైర్మన్‌గా వెంకటేష్‌యాదవ్‌లు పనిచేసిన విషయం తెలిసిందే. వారిపై మెజార్టీ కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టి గతనెల వారిని పదవీచ్యుతులను చేశారు.

జవాబుదారీతనం లేకుంటే ఎలా.. ?

మున్సిపల్ సమావేశానికి విద్యుత్, జలమండలి, రెవెన్యూ తదితర శాఖల అధికారులు ఎవరూ హాజరు కాకపోవటం, చర్చించాల్సిన ప్రధాన సమస్యలు వారివే ఉండటంతో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో పది రోజుల్లో మరో సమావేశాన్ని ఏర్పాటు చేసి వారిని సమావేశానికి రప్పించాలని కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి సూచించారు. అంతలోపు వారిపై తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరుతూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. ప్రజలు చెల్లించే పన్నులతో జీతాలు తీసుకుంటున్న అధికారులు వారికి జవాబుదారీతనం లేకుండా విధులు నిర్వహించడం సరికాదన్నారు.

నూతన ప్రతినిధులు..

కొత్తగా చైర్‌పర్సన్‌గా మంచిరేవులకు చెందిన మైలారం నాగపూర్ణశ్రీనివాస్, వైస్ చైర్మన్‌గా కోకాపేటకు చెందిన విజయ్‌బాబులు ఎన్నికయ్యారు. వారి ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన మొదటి సర్వసభ్య సమావేశానికి మాజీ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌లతో పాటు నార్సింగి కౌన్సిలర్ అరుణజ్యోతిలు గైర్హాజరయ్యారు. వారికి అవిశ్వాసం సమయంలో మద్దతుగా నిలిచిన గండిపేట కౌన్సిలర్ విజిత, కో- ఆప్షన్ సభ్యుడు ప్రశాంత్‌యాదవ్‌లతో పాటు అవిశ్వాసానికి మద్దతు ఇచ్చిన కౌన్సిలర్లు సమావేశానికి హాజరయ్యారు. మున్సిపల్ మేనేజర్ యోగేష్, డీఈ నరసింహరాజు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. మున్సిపల్ సమావేశాలు నిర్వహించే సమావేశ మందిరాన్ని హైటెక్ పద్ధతిలో తీర్చిదిద్దటం సభ్యులను ఆకట్టుకుంది.

రూ. 56.57 కోట్లతో తీర్మానాలు..

నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో భవిష్యత్తులో చేపట్టాల్సిన ప్రధాన పనులకు మంగళవారం జరిగిన పాలకకమిటీ సమావేశం నిధులను కేటాయిస్తూ తీర్మానాలు చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డులలో కమ్యూనిటీహాళ్ల నిర్మాణాలకు రూ.22.12 కోట్లు, సీసీరోడ్లకు రూ.13.52 కోట్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు రూ.8.45 కోట్లు, పారిశుద్ధ్య కార్మికుల పనిముట్లు, బోర్ మెటీరియల్, ఇతర పనులకు రూ. 6.31 కోట్లు ఖర్చుచేయాలని తీర్మానం చేశారు. వైకుంఠ దామం పనులకు రూ. 2.62, వీధిదీపాలకు రూ. 2.55 కోట్లు, హరిత పనులకు రూ. కోటితో, మొత్తం రూ.56.57 కోట్ల నిధులను కేటాయిస్తూ తీర్మానాలు చేశారు.

ప్రత్యేక పూజలు

శంషాబాద్ రూరల్: మండలంలోని పిల్లోనిగూడలో బొడ్రాయి పండుగ రెండో వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం గ్రామంలోని అన్ని ఆలయాల్లో పూజలు చేయగా.. కార్యక్రమంలో గ్రామ నాయకులు నర్సింహ, సత్తయ్య, అంతయ్య, కిష్టయ్య, గోపాల్, సుధాకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం: ఉర్దూ విశ్వవిద్యాలయంలోని చరిత్ర విభాగంలో ఎంఏ హిస్టరీ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని చరిత్ర విభాగాధిపతి ప్రొఫెసర్ రఫీవుల్లాఅజ్మీ పేర్కొన్నారు. ఎంఏ హిస్టరీలో మొత్తం 30 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. గ్రాడ్యుయేషన్‌లో మార్కుల (మెరిట్) ఆధారంగా అడ్మిషన్లు ఇవ్వబడుతాయన్నారు, మరిన్ని వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని, అంతేకాకుండా ఫోన్ నంబర్లు 9818754676,9454137901, 7007089699లలో సంప్రదించాలని సూచించారు.

గచ్చిబౌలిలో ఓపెన్‌టెక్స్ట్ కార్యాలయం ప్రారంభం

రాయదుర్గం: గచ్చిబౌలిలో ఓపెన్‌టెక్స్ట్ నూతన కార్యాలయాన్ని మంగళవారం ప్రారంభించారు. ఓపెన్‌టెక్స్ట్ రీజియన్ వర్క్‌ఫోర్స్‌లో పెట్టుబడి 25 శాతం వృద్ధిని నమోదు చేసిందని సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్‌ప్రెసిడెంట్, చీఫ్ ప్రొడక్ట్ ఆఫీసర్ ముహిమజ్జాబ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ డెవలప్‌మెంట్ సెంటర్‌లోని ఇంజనీర్లు వ్యాపార క్లౌడ్‌ల కోసం ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ కార్యకలాపాలకు నాయకత్వం వహించనున్నారన్నారు.

పారిశుద్ధ్యంపై సమీక్ష సమావేశం


అధికారులతో సమావేశమైన డీసీ రవికుమార్

రాజేంద్రనగర్: బక్రీద్ పండుగ సందర్భంగా పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకోవాలని రాజేంద్రనగర్ సర్కిల్ ఉపకమిషనర్ రవికుమార్ సూచించారు. మంగళవారం ఆయన కార్యాలయంలో ఎస్‌ఎఫ్‌ఏలు, ఎస్‌ఎస్‌లు, డిప్యూటీ ఎస్‌డబ్ల్యూఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బక్రీద్ పండుగ సందర్భంగా జంతువుల వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. జంతు వ్యర్థాలను వేసేందుకు కవర్లను పంపిణీ చేస్తున్నామన్నారు. వ్యర్థాలను అందులో వేసి చెత్త సేకరించే ఆటోరిక్షా వారికి అందజేసి సహకరించాలని, బక్రీద్ పండుగ సందర్భంగా శానిటేషన్ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికలు

వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్‌లోని బస్తీలలో చేపట్టాల్సిన మౌలిక వసతులపై తగిన ప్రణాళిక రూపొందించాలని జీహెచ్‌ఎంసీ వెస్ట్‌జోన్ శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. డివిజన్‌లోని గోపన్‌పల్లితండా, గోపన్‌పల్లి, రాజీవ్‌నగర్‌లో గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, అధికారులతో కలిసి మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బస్తీల్లో చేపట్టాల్సిన సీసీరోడ్లు, డ్రైనేజీ, వాటర్ పైప్‌లైన్‌ల ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అసంపూర్తి పనులు, పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆమె ఆదేశించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ గచ్చిబౌలి డివిజన్‌లో చెరువుల సుందరీకరణ, పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. కాలనీలు, బస్తీలలో పూర్తి స్థాయి మౌలిక వసతుల కల్పనకు తగిన నిధులు మంజూరు చేసిన త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


అలకాపూర్‌లో పర్యటిస్తున్న కమిషనర్ ప్రదీప్‌కుమార్

మణికొండ: అలకాపూర్ టౌన్‌షిప్ 9వ వార్డు పరిధిలో ఉన్న సమస్యలను త్వరలోనే పరిష్కరించేలా కృషి చేస్తామని మణికొండ మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన 9వ వార్డు కౌన్సిలర్ శ్రీకాంత్‌స్వామి, ఏఈ సాయి మానికతో కలిసి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ యోగా సర్కిల్ రోడ్డు పొడగింపు, నేతాజీ పార్కులో మూత్రశాలల నిర్మాణం, కూడలిల బ్యూటిఫికేషన్, ఇంకుడు గుంతల నిర్మాణం, వీధిదీపాలు, పెండింగ్‌లో ఉన్న రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీంతో వాటిని త్వరలోనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మున్సిపల్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మెదక్ ఎంపీకి ఘనస్వాగతం


ఎంపీ రఘునందన్‌రావుకు స్వాగతం పలుకుతున్న బొక్క నర్సింహారెడ్డి

శంషాబాద్: మెదక్ పార్లమెంటు నియోజకవర్గంలో విజయం సాధించిన రఘునందన్‌రావుకు శంషాబాద్ విమానాశ్రయంలో ఆ పార్టీ నేతలు ఘనంగా స్వాగతం పలికారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రమాణస్వీకారానికి వెళ్లిన ఆయన మంగళవారం రాత్రి ఢిల్లీ నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు చింతల నందకిశోర్‌గుప్తా తదితరులు పూలమాలతో సత్కరించి సన్మానించారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

'ఎస్కీ' డైరెక్టర్ డా.రామేశ్వరరావు

రాయదుర్గం: మనిషి దైనందిన జీవితంలో ఎన్ని పనులున్నా ఆరోగ్యంపట్ల శ్రద్ధ వహించాలని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని 'ఎస్కీ' ప్రాంగణంలో మంగళవారం ఎస్కీ సిబ్బంది, అధికారులు, వివిధ విభాగాల్లో శిక్షణ కోసం వచ్చిన అభ్యర్థులకు గచ్చిబౌలిలోని కేర్ ఆస్పత్రి వైద్యుల సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ మనిషి ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఏ పనైనా చేయగలరన్నా రన్నారు. అప్పుడప్పుడు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని ఆయన సూచించారు. అంతకుముందు వైద్యులు బీపీ షుగర్, టెంపరేచర్, ఆర్థో తదితర పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో గచ్చిబౌలి కేర్ ఆస్పత్రి డాక్టర్లు మదానీ, ప్రవీణ్, శ్రీదేవి, ఆకాంక్ష, నర్సులు, సిబ్బంది ఎస్కీ ఫ్యాకల్టీ లక్ష్మీకాంతారావు, అమర్‌నాథ్, రాజశేఖర్‌రెడ్డి, మనోహరాచారి, ఆదినారాయణ, చంద్రకళ, ఆది, నరేష్, పద్మావతి, శ్రీధర్, తిలక్, కవిత, చంద్రమోహన్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రుద్ర సహిత చండీయాగం

శేరిలింగంపల్లి: గచ్చిబౌలి డివిజన్‌లోని నేతాజీనగర్‌లో సాయిబాబా ఆలయం 14వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయంలో రుద్ర సహిత చండీయాగంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జోషి రాఘవేంద్రశర్మ 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయనకు స్వర్ణకంకణం తొడిగారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్, తేజస్వీశర్మ, హిమాలయ తపస్వి సిద్ధయోగి, నాయకులు రాగం అనిరుధ యాదవ్, అభిషేక్ యాదవ్, తిరుమలేష్, గోపాల్‌యాదవ్, రాజు, మహేష్, రంజిత్, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవతోనే గుర్తింపు

గోల్కొండ: సమాజ సేవతోనేగుర్తింపు వస్తుందని పీస్ ఫోర్స్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ నజీబ్ అన్నారు. మంగళవారం ఆయన టోలిచౌకీలోని పీస్ ఫోర్స్ కార్యాలయంలో మహ్మద్ ఇస్మాయిల్‌కు పీస్ ఫోర్స్ కమిటీలో సభ్యత్వ పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ కుటుంబం కోసం వివిధ రకాల పనులు, వృత్తులు చేసుకుంటారన్నారు. అయితే సమాజంలో ఎన్నో కుటుంబాలు పేదరికంలో ఉన్నాయని పేర్కొన్నారు. వారి పిల్లలు చదువుకోలేపోతున్నారన్నారు. అటువంటి కుటుంబాలకు అండగా ఉండి వారి పిల్లలు చదువుకునేలా ఆదుకోవాలని ఆయన స్పష్టం చేశారు. పీస్ ఫోర్స్ సొసైటీ శాంతిని కోరుకోవడంతో పాటు సేవా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తుందన్నారు.

గోల్కొండలో 'బడిబాట'

గోల్కొండ: బడీడు పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేరాలని గోల్కొండ ప్రభుత్వ తెలుగు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వై.ఎస్.అనురాధాదేవి అన్నారు. మంగళవారం ఆమె గోల్కొండ చోటాబజార్, ఖాజీగల్లి, జామా మజీదు గల్లీ తదితర ప్రాంతాల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ తిరిగి బడికి రాని పిల్లల వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆమె స్థానికులతో మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో గతంలో కంటే మరిన్ని మెరుగైన సౌకర్యాలను ప్రభుత్వం కల్పించిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. పిల్లల బంగారు భవిష్యత్తు కోసం పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఆమె కోరారు.

ఎండ, వానకు షెల్టర్లుగా ఫ్లై ఓవర్లు



గోల్కొండ: ఫ్లై ఓవర్లు వాహనాదారులకు రక్షణగా మారాయి. మెహిదీపట్నం పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే, టోలిచౌకీ చౌరస్తా ఫ్లై ఓవర్, షేక్‌పేట్ పాత ముంబాయి జాతీయ రహదారి ఫ్లై ఓవర్లు వాహనాదారులకే కాకుండా తోపుడు బండ్ల వ్యాపారులు, పాదచారులకు ఎండకు, వానకు షెల్టర్లుగా మారుతున్నాయి. అత్యంత రద్దీగా ఉండే మెహిదీపట్నం, పాత ముంబాయి జాతీయ రహదారిపై వాహనాదారులు వర్షం మొదలుకాగానే ఫ్లై ఓవర్ కింద వాహనాలు ఆపి షెల్టర్ పొందుతున్నారు. భారీ వర్షం నుంచి ఈ విధంగా వారు ఫ్లై ఓవర్ కింద తలదాచుకుంటున్నారు. రోడ్ల పొడవునా వ్యాపారం చేసే తోపుడు బండ్ల వారు సైతం వర్షం మొదలు కాగానే ఫ్లై ఓవర్ కిందకు తమ తమ తోపుడు బండ్లతో చేరుతున్నారు.

బఫర్ జోన్‌లో భారీ నిర్మాణాలు..

నీటిపరీవాహక ప్రాంతాల్లో అడ్డగోలు ఆక్రమణలు

- కొనుగోలు దారులను ఆకట్టుకునే నమూనాలు
- పేట్రేగుతున్న 'రియల్' మూకలు
- ఇష్టారాజ్యంగా ఎన్‌ఓసీలు
- అధికారులకు భారీగా ముడుపులు
- చర్యలు తీసుకోవాలంటున్న స్థానికులు

బండ్లగూడ: ఈసీ నది పరీవాహక ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. కొనుగోలుదారులను అకట్టుకునేందుకు నదీ ముఖంగా నిర్మాణాలంటూ పలు రకాల నిర్మాణ సంస్థలు మూసీకి ఉప నదిగా ఉన్న ఈసీ నదిని కప్పేస్తున్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ అనే తేడా లేకుండా అడ్డగోలు నిర్మాణాలు చేపడుతున్నారు.

◆ గండిపేట మండలం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నీటి పరీవాహక ప్రాంతాల్లో ఇష్టారీతిగా నిర్మాణాలు చేపడుతున్నారు. వరద ప్రవాహ మార్గాన్ని మళ్లించేలా కట్టలు పోస్తున్నారు. ప్రాజెక్టు నదికి దూరంలో ఉందని చూపేందుకు భౌగోళిక స్వరూపాన్ని చెరిపేస్తున్నారు. కిస్మత్‌పూర్ వంతెన సమీపం నుండి సన్‌సిటీ వరకూ ఈసీ నది పరీవాహ ప్రాంతాల్లో జోరుగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా రెవెన్యూ అధికారులు, నీటిపారుదల శాఖ అధికారులు అడ్డుకోడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఒక వైపు ముఖ్యమంత్రి నీటి వనరులను సంరక్షించుకునేందుకు అన్ని చర్యలూ తీసుకోవాలని బాధ్యతలు చేపట్టిన వెంటనే హెచ్‌ఎండీఏ అధికారులను ఆదేశించినా పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నది అంచునే నిర్మాణాలు..

కిస్మత్‌పూర్ వంతెన పక్కన నుండి ఈసీ నీటి పరీవాహక ప్రాంతాల్లో వంతెన పక్కన కొన్ని ఎకరాలను ఓ రియల్ వ్యాపార సంస్థ ఆక్రమించింది. బఫర్‌జోన్‌లో రోడ్ల నిర్మాణాలు చేపట్టి, కొంతమేర నదిని ఆక్రమించేస్తున్నారు. అంతటితో ఆగకుండా అందులో మట్టిపోసి రోడ్డు నిర్మాణం చేపట్టి నది అంచు వరకూ విల్లాలు నిర్మిస్తున్నారు.

అడ్డగోలుగా ఎన్‌ఓసీలు..

ఈసీ, మూసీ నదులు, చెరువులు, వాగులు, కుంటల్లో బఫర్‌జోన్లు, శిఖం భూములు అనే తేడా లేకుండా అధికారులు అడ్డగోలుగా ఎన్‌ఓసీలు మంజూరు చేస్తున్నారు. దీనికి గానూ భారీగా ముడుపులు ముట్టాయన్న ఆరోపణలు వినిస్తున్నారు. తక్షణమే స్పందించి వీరిపై తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రియల్ వ్యాపారులపై చర్యలేవీ..

హిమయత్‌సాగర్ జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం చేరుకున్న ప్రతిసారీ అధికారులు ట్రస్టు గేట్లను ఎత్తి అదనపు నీటిని ఈసీ నదిలోకి వదులుతారు. ఈ సమయంలో లోతట్టు ప్రాంతాల్లోని పలు కాలనీ వాసులను ఎగువ ప్రాంతాలకు తరలిస్తారు. కాగా బఫర్‌జోన్‌లో ఏకంగా విల్లాలు నిర్మించి ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్న రియల్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

నిబంధనలకు పాతర..

బఫర్‌జోన్లలో చేపట్టే నిర్మాణాలు అధికారులకు కనిపించడం లేదా అన్న విమర్శలు ఉన్నాయి. నిబంధనలన్నీ తుంగలో తొక్కి ఈసీ వాగు బఫర్‌జోన్‌లో బిల్డింగులు, విల్లాల నిర్మాణం చేయడమే పెద్ద తప్పయితే.. ఆయా భవనాలను గుర్తించి కూల్చివేయాల్సిన అధికారులే వారికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.


కిస్మత్‌పూర్ వంతెన వద్ద ఈసీనదిలో రాళ్లతో నింపేస్తున్నారు ఇలా..


భారీగా నదిప్రాంతంలో మట్టితో పూడ్చుతున్న దృశ్యం


ఈసీనదిలోకి చొచ్చుకుని నిర్మాణాలు